క్లుప్తంగా

అభివృద్ధిని అడ్డుకునే కుట్రలను సహించం



మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: అభివృద్ధిని అడ్డుకునే విధంగా వ్యవహరిస్తున్న బీజేపీ, కాంగ్రెస్‌ల తీరును సహించేది లేదని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం గజ్వేల్‌లోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల కష్టాలను ఏనాడు పట్టించుకోని ఈ రెండు పార్టీలు నేడు సమస్యలపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలో తెలంగాణ అభివృద్ధిలో దిక్సూచిగా మారుతున్న నేపథ్యంలో దీనిని జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలతో ముందుకుసాగుతున్నారని మండిపడ్డారు. ప్రత్యేకించి గజ్వేల్ అభివృద్ధిపై విమర్శలు చేస్తే ప్రజలు వారిని గాడిదలపై ఊరేగిస్తారని మండిపడ్డారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవీందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, బీఆర్ఎస్ గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతాం

హుస్నాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 84వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఏఐఎఫ్‌బీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గవ్వ వంశీధర్‌రెడ్డి, మనోహర్‌గౌడ్, మల్లేశ్, రవీందర్‌గౌడ్, రాజేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుదాం

గజ్వేల్‌రూరల్: ప్లాస్టిక్‌ను నిషేధించి స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్ది ఆదర్శంగా నిలుపుదామని బయ్యారం గ్రామ సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం గ్రామంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాలలో 70 మంది విద్యార్థులకు వాటర్ బాటిళ్లను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు భిక్షపతిగౌడ్, రాములు, శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, మోహన్‌బాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామంలో విరివిగా మొక్కలను నాటే విధంగా, గ్రామ నర్సరీ నుంచి ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేయాలని నర్సాయిపల్లి సర్పంచ్ బద్దిపడగ లలితకృష్ణారెడ్డి అన్నారు. గురువారం గ్రామంలోని నర్సరీని ఈసీ పరశురాములుతో కలిసి ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో వర్క్‌షాప్

సిద్దిపేటఅర్బన్: ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎథికల్ హ్యాకింగ్‌పై ఒకరోజు వర్క్‌షాప్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో ఇకతాను లైవ్ ఎథికల్ హ్యాకింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు అమెరికాకు చెందిన బ్రాంగస్ కంపెనీ వ్యవస్థాపక సీఈవో జియోఫ్ ఎంసీనాబ్ హాజరై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాయికిరణ్, డాక్టర్ జావిద్‌ఖాన్, పీఆర్వో రఘు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పట్టణంలో పురాతన శైవక్షేత్రం శరభేశ్వర ఆలయ నూతన పాలకమండలిని గురువారం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. శాశ్వత పాలకమండలి చైర్మన్‌గా గట్టు పల్లి రాజేశ్వర శర్మ, సభ్యులుగా గందే ఎల్లేశం, పెరక నాగరాజు, బిజ్జ అనిత, నాగరాజు, మల్లేశం, చందు, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఆలయ పూజారి శశికుమార్ శర్మలను ప్రకటించారు.

బీటీరోడ్డు పనుల పరిశీలన

దుబ్బాకరూరల్: మండలంలోని అప్పనపల్లి, హసన్‌మీరాపూర్ గ్రామాల మధ్య జరుగుతున్న బీటీరోడ్డు పనులను గురువారం ఎమ్మెల్యే రఘునందన్‌రావు పరిశీలించారు. పనుల్లో అలసత్వంపై అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.రోడ్డు బాగాలేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

అమరుల త్యాగం వెలకట్టలేనిది

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం



గజ్వేల్ మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తదితరులు

గజ్వేల్‌రూరల్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అమరుల త్యాగం వెల్లకట్టలేనిదని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఏసీపీ రమేశ్, తహసీల్దార్ బాల్‌రాజు, సీఐ వీరప్రసాద్‌లతో కలిసి అమరవీరులను స్మరిస్తూ మౌనం పాటించి నివాళులర్పించారు. అదే విధంగా పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌లో ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఐవోసీలోగల మండల పరిషత్ సమావేశ కార్యాలయంలో ఎంపీపీ దాసరి అమరావతి ఆధ్వర్యంలో, ప్రభుత్వ బాలుర, మహిళా డిగ్రీ కళాశాలల్లో తెలంగాణ ఉద్యమ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ విద్యాధర్, వైస్‌చైర్మన్ జకియొద్దీన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. శ్రీనివాస్‌రెడ్డి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశితో పాటు ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హుస్నాబాద్: తెలంగాణ అమరుల త్యాగాలు వెలకట్టలేనివని, అమరుల త్యాగాలతోనే ప్రత్యేక రాష్ట్రం సాకారమైందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. కార్యాలయంలో అమరుల సంస్మరణ సభ ఏర్పాటు చేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

దుబ్బాకటౌన్: పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత పూలమాల వేసి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అమరవీరులను స్మరిస్తూ నివాళులర్పించారు.

అమరులను స్మరించుకోవాలి

సిద్దిపేటకమాన్: అమరులను స్మరించుకోవడం పోరాట యోధులకు మనమిచ్చే గొప్ప నివాళి అని అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ అన్నారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ అమరువీరులకు గురువారం పోలీసు అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీధర్‌రెడ్డి, కార్యాలయ సూపరింటిండెంట్‌లు, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటజోన్: తెలంగాణ మలి దశ ఉద్యమంలో స్వరాష్ట్ర సాధనలో అమరులైన తెలంగాణ బిడ్డల త్యాగాలు చరిత్రలో నిలిచిపోతాయని మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మంజుల ఆధ్వర్యంలో ప్రత్యేక కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం వహించారు.

చేర్యాలలో..

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఉన్న అమరవీరుల స్తూపం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి ఆధ్వర్యంలో నివాళులర్పించారు.



సిద్దిపేటజోన్: మౌనం పాటిస్తున్న చైర్‌పర్సన్ మంజుల తదితరులు



చేర్యాల(సిద్దిపేట): చేర్యాలలో..



హుస్నాబాద్: మున్సిపల్ కార్యాలయ ఆవరణలో..



దుబ్బాకలో..



సిద్దిపేటకమాన్: పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో..



మిరుదొడ్డి: నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

హామీలను విస్మరించిన సీఎం కేసీఆర్

మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి



హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి



దుబ్బాక: సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

హుస్నాబాద్: సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, రాష్ట్రానికి ఏం ఉద్ధరించాడని దశాబ్ది ఉత్సవాల పేరుతో కార్యక్రమాలు చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ప్రశ్నించారు. టీపీసీసీ ఆదేశాల మేరకు దశాబ్ది దగా పేరుతో గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు రాస్తారోకో నిర్వహించి, కేసీఆర్ వైఫల్యాలను ఎండగట్టాలని ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రజలను మభ్యపెట్టేందుకే కేసీఆర్ పథకాలను తీసుకొస్తున్నారనే విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రవీణ్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల అధ్యక్షులు చందు, అయిలయ్య, ధర్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరిగిందని వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు యాదగిరి, మహేందర్‌రావు, సూర్యవర్మ, చంద్రశేఖర్ ధీమా వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో గురువారం ఖానాపూర్‌లో పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో రమేశ్, సత్తయ్య, యాదగిరి, కృష్ణ, రంగారెడ్డి, రాజిరెడ్డి, కిరణ్, నవీన్, యాదగిరి పాల్గొన్నారు.

ఉత్సవాల పేరుతో ప్రజాధనం వృథా

దుబ్బాక: సీఎం కేసీఆర్ ప్రజలను మభ్యపెట్టడానికే దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నారని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దుబ్బాక పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పి కాంగ్రెస్‌ను గద్దెనెక్కించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రాజిరెడ్డి, ఆకుల భరత్, వెంకట్ గౌడ్, తదితరులున్నారు.

సిద్దిపేటజోన్: పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజలను దగా చేసిందంటూ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రావు, చంద్రం, అత్తు, అంజయ్య, సతీశ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటకమాన్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో చిన్నకోడూరు మండల అధ్యక్షుడు మహేందర్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ సెక్రటరీ నర్సయ్య, జయంత్, గణేశ్, నరేశ్, బాబు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



దుబ్బాకటౌన్: ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు



హుస్నాబాద్: ప్రజలకు పథకాలను వివరిస్తున్న నాయకులు

దుబ్బాకటౌన్: రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. గురువారం తన స్వగ్రామం భూంపల్లి–అక్బర్‌పేట మండలం బొప్పాపూర్‌లో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రజలు బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజలు విసుగుతో ఉన్నారన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా వెలుగొందుతుందన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో ఇంటింటా బీజేపీ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భానుప్రసాద్, కృష్ణ, ఎల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వేచరేణి గ్రామంలో గురువారం 24వ బూత్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేశ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బాల్‌రాజు, శ్రీనివాస్, చంద్రం, తిరుపతి, ప్రసాద్, ఐలుమల్లు, మహేశ్ పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని వట్టిపల్లి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ మోదీ 9 ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాములు, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అజిత్‌రెడ్డి, స్వామి, సుధాకర్, రమేశ్, రాజిరెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

దుబ్బాక: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేశ్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని 15వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రధాని మోదీ చేపట్టిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో భాస్కర్, ప్రవీణ్‌కుమార్, రమేశ్‌రెడ్డి, రమణారెడ్డి, నరేశ్, వంశీ తదితరులున్నారు.

గజ్వేల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లిలోగల 17వ వార్డులోని 194వ బూత్‌లో ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి శివకుమార్, బీజేపీ గజ్వేల్ అసెంబ్లీ విస్తారక్ అనూప్, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు విజయ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ శేఖర్, పట్టణ అధ్యక్షుడు యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

మోదీ సంక్షేమ పథకాలతోనే అభివృద్ధి

హుస్నాబాద్: పట్టణంలోని 9, 10, 11వ బూత్ పరిధిలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తోట స్వరూప, నాయకులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలను స్మరిద్దాం

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ తదితరులు

సిద్దిపేటజోన్: తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాలను త్యాగం చేసి అమరులైన వారిని స్మరిద్దామని జెడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ అన్నారు. గురువారం పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమరుల దినోత్సవం సందర్భంగా జెడ్పీ సమావేశంలో తెలంగాణ అమర వీరులకు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జెడ్పీ సమావేశంలో వారి త్యాగాలను స్మరిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. అమరుల ఆశయ స్ఫూర్తితో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ అన్ని రంగాల్లో అణిచివేతకు గురైందన్నారు. జిల్లాలో దశాబ్ది ఉత్సవాలు మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో విజయవంతంగా జరిగినట్టు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రముఖ పాత్ర పోషించిన అమరవీరులకు జోహార్లు పలికారు. అంతకుముందు అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ మాట్లాడుతూ.. అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య స్వల్ప వాగ్వాదం

దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని, ఒక్క హామీ అమలు చేయలేదని మద్దూర్ జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి ఆరోపించారు. దీనికి ప్రతిస్పందనగా బీఆర్ఎస్ జెడ్పీటీసీలు సుధాకర్, యాదగిరిలు జోక్యం చేసుకొని 60 ఏళ్ల కాంగ్రెస్ హయాంలో జరిగింది ఏమి లేదని విమర్శించారు. ఒకదశలో జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు

నామమాత్రంగా చిన్నకోడూరు మండల సమావేశం



చిన్నకోడూరులో అమరవీరుల చిహ్నానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ ఉపాధ్యక్షుడు కీసరి పాపయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ప్రజా సమస్యలపై అధికారులను నిలదీసి, ప్రజల సమస్యలు పరిష్కరించే అవకాశం ఉన్నా.. ప్రశ్నలు అడిగే వారు కరువయ్యారు. ప్రగతి నివేదికలు చదువుకొని అధికారులు వెళ్లిపోవడం గమనార్హం. ఈ సందర్భంగా ఎంపీపీ ఉపాధ్యక్షుడు పాపయ్య మాట్లాడుతూ.. అధికారులు గ్రామాలను సందర్శించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం అమరవీరుల చిహ్నానికి పూలమాలలు వేసి నివాళులర్పిచారు.

సమన్వయంతో పని చేసినప్పుడే అభివృద్ధి

ములుగు మండల సమావేశంలో ఎంపీపీ లావణ్య



మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య

ములుగు(గజ్వేల్): అధికారులు, పజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాల అభివృద్ధికి ఆస్కారం ఏర్పడుతుందని ములుగు ఎంపీపీ లావణ్యఅంజన్‌గౌడ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్ రెడ్డి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. అనంతరం కొనసాగిన సమావేశంలో విద్యుత్ ఏఈ తన నివేదికను చదివి వినిపిస్తున్న క్రమంలో కొక్కొండ గ్రామ సర్పంచ్ బంగ్ల గణేశ్ విద్యుత్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామంలో ఇద్దరు వ్యక్తుల మృతికి కారణమైన ఇళ్లపై నుంచి వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించాలని పలుమార్లు జరిగిన సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇందుకు విద్యుత్ ఏఈ శ్రీనివాస్ సమాధానమిస్తూ నిధుల మంజూరులో ఏర్పడుతున్న జాప్యం కారణంగా పనులను చేపట్టలేక పోతున్నామని తెలిపారు. సమావేశంలో ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆ గ్రామాలను అక్కన్నపేటలోనే కొనసాగించాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి, జనగామ రెవెన్యూ గ్రామాలు హుస్నాబాద్‌లో విలీనం కాకుండా అక్కన్నపేట మండలంలోనే కొనసాగించాలని గురువారం సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మండలంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాలోతు లక్ష్మి అధ్యక్షతన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమరుల సంస్మరణ ముగింపు సందర్భంగా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరువీరులకు నివాళి అర్పించి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. గౌరవెల్లి, జనగామ, గుబ్బడి గ్రామాలను అక్కన్నపేట మండలంలోనే కొనసాగించాలని రామవరం గ్రామ ఎంపీటీసీ లింగాల శ్రీనివాస్ సర్వసభ్య సమావేశంలో ప్రతిపాదించగా, సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అదేవిధంగా గౌరవెల్లి రిజర్వాయర్ పనులు చివరిదశకు చేరుకోవడంతో కుడి కాల్వ ద్వారా నీళ్లు విడుదల చేయాలని గుడాటిపల్లి ఎంపీటీసీ బైరి రవీందర్ ప్రతిపాదించగా, సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మండల కేంద్రంలో అన్నీ ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట నిర్మించేందుకు సమీకృత భవనాలు నిర్మించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం ఎంపీపీ మాలోతు లక్ష్మి మాట్లాడుతూ.. ఎంతో ప్రతిష్టాత్మకం చేపట్టిన దశాబ్ది ఉత్సవాలు మండలంలో ఘనంగా నిర్వహించుకున్నామన్నారు. ప్రతిరోజు ఓ పండగా వాతావరణం తలపించేలా కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు, అధికారులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, ఎంపీఓ కవికుమార్, ఏపీఓ ప్రభాకర్, ఏపీఎం శ్రీనివాస్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సభ్యుల ఏకగ్రీవ తీర్మానం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పాండుగౌడ్

మర్కూక్(గజ్వేల్): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ పాండుగౌడ్ అన్నారు. గురువారం మండల కార్యాలయంలో ఎంపీపీ పాండుగౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వర్ధరాజ్‌పూర్ సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ.. పంచాయతీరాజ్‌శాఖ అధికారులు 4 కోట్ల నిధులు ఉన్న టెండర్లు పిలిచి పనులు చేయడం లేదని అధికారుల తీరును సభను దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్న విద్యుత్ శాఖల దృష్టికి తీసుకెళ్లినా సరిచేయడం లేదని ప్రజాప్రతినిధులు వాపోయారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, జెడ్పీటీసీ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా అర్బన్ సమావేశం

10 మంది మాత్రమే హాజరు

సిద్దిపేటఅర్బన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం సిద్దిపేట అర్బన్ మండల ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభం కావాల్సి ఉండగా మధ్యాహ్నం 12 అయినా కూడా నలుగురు ఎంపీటీసీలు, ఒక్క సర్పంచ్ మినహాయిస్తే ఒక్కరూ కూడా హాజరు కాలేదు. మండల అధికారులు సైతం ముగ్గురు, నలుగురు మాత్రమే హాజరయ్యారు. వచ్చిన ఆ కొద్దిమంది అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎంపీఓ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఎల్లం అమరవీరుల చిత్రపటానికి నివాళి అర్పించి కార్యక్రమాన్ని ముగించారు.

మన బడి పనులు వెంటనే పూర్తి చేయాలి

కొమురవెల్లి మండల సమావేశంలో ఎంపీపీ కీర్తన

కొముురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మన ఊరు–మన బడి పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఎంపీపీ తలారి కీర్తన ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. సభ ప్రారంభం కాగానే అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సభలోని సభ్యులు 2 నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. మండలంలోని రసులాబాద్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు టీచర్లలో ఉపాధ్యాయురాలు సుప్రియ ఒక్కరోజు పాఠశాల విధులకు హాజరై మూడురోజులు సెలవు పెడుతుందని, దీంతో విద్యార్థులు నష్టపోతున్నారని సర్పంచ్ స్వామి ఎంఈఓను నిలదీశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని విద్యార్థులకు నష్టం జరగకుండా చర్యలు చేపడతామని సభకు ఎంఈఓ హామీ ఇచ్చారు. తమ గ్రామంలో మంచినీటి ట్యాంకులను కడగడం లేదని, మిషన్ భగీరథ నీరు గ్రామానికి సరిపడా రావడం లేదని అయినాపూర్ సర్పంచ్ రమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నీటి ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీఓ అనురాధ, ఎంపీఓ మంజుల, పర్యవేక్షకులు రాంప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.